సర్కారు బడుల్లో డిజిటల్ పాఠాలు

- ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలతో విద్యార్థులకు బోధన
- ప్రైమరీ స్కూళ్లకు రూ.1.50 లక్షల, హైస్కూళ్లకు రూ.3.50 లక్షల విలువైన స్మార్ట్ టీవీలు
- మొదటి విడతలో మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలలకు 110 స్మార్ట్ ఎల్‌ఈడీలు
- పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయంటున్న విద్యార్థులు



ఆలూరు ఏపీ మోడల్ స్కూల్‌లో ఎల్‌ఈడీల ద్వారా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు



స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ హంగులు సమకూర్చి అంతర్జాతీయ ప్రమాణాలను కల్పిస్తోంది. దేశంలోనే తొలిసారిగా విద్యారంగంలో పూర్తిస్థాయి సంస్కరణలకు నాంది పలికిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)లు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు సరికొత్త విద్యా బోధనలు అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా మొదటి విడత కింద ఆలూరు మండలంలోని 16 ప్రైమరీ, 12 హైస్కూళ్లలో 110 స్మార్ట్ టీవీలను అందించడంతో వాటి ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. ఒక్కో ఐఎఫ్‌పీకి రూ.3.50 లక్షలు, ఒక్క స్మార్ట్ టీవీకి రూ.1.50 లక్షలు వెచ్చించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా..

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సైతం ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం డిజిటల్ హంగులు సమకూరుస్తోంది. బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాస్తూ పాఠ్యాంశాలు బోధించే పద్ధతికి స్వస్తి పలకనున్నారు. రానున్న రోజుల్లో పూర్తిగా డిజిటల్ బోధనే కొనసాగనుంది. ఇందుకు అనుగుణంగా హైస్కూల్స్‌లో ఇంటరాక్టివ్ (ఐఎఫ్‌పీ) ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా బోధన చేయనున్నారు. వాటికి ఇంటర్నెట్ అనుసంధానం చేశారు. అలాగే బైజూస్ కంటెంట్‌తో పాఠాలు బోధిస్తారు. దీంతో పాఠ్యాంశాలు అనేక ఉదాహరణలతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉంటాయి. ఇందుకోసం ఉన్నత విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు.

ఉపయోగం ఇలా..

తరగతి గదిలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు వీడియో ద్వారా పాఠ్యాంశాల బోధించడం వల్ల గొప్ప అనుభూతి కలుగుతోంది. ఉపాధ్యాయులు కూడా విద్యా బోధనలో అవసరమైన ప్రయోగాల కల్పన నేరుగా డిజిటల్ స్క్రీన్‌పై చూపేందుకు అవకాశం ఉంది. దీన్ని విద్యార్థులకు స్క్రీన్‌పై కొద్దిసేపు నిలిపి మరీ చూపించగలుగుతారు. వీటిని బ్లాక్ బోర్డుగా ఉపయోగించుకోవచ్చు. రాసిని దానిని చేతితో సైతం చరిపేయవచ్చు. ఇంటర్నెట్ ఉపయోగించి కంప్యూటర్ మాదిరిగా వాడుకోవచ్చు. యూట్యూబ్, ఫోన్, ట్యాబ్‌లలో ఉన్న సమాచారం సైతం స్క్రీన్‌పై చూసే అవకాశం కూడా కల్పించారు. స్మార్ట్ టీవీల ద్వారా విద్యార్థులకు గణితం, సైన్స్‌తో పాటు అన్ని సబ్జెక్టుల పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయని విద్యార్థులు చెపుతున్నారు.

పాఠ్యాంశాలు బాగా అర్థమవుతున్నాయి



స్మార్ట్ టీవీల ద్వారా బోధించే పాఠ్యాంశాలు, వివిధ ఖండాల మ్యాప్‌లు సులువుగా అర్థమవుతున్నాయి. అర్థం కాకపోతే మరోసారి అడిగి తెలుసుకుంటున్నాం. గతంలో బోర్డుపై రాసి తుడిపి వేసిన తర్వాత అర్థమయ్యేది కాదు. బైజూస్ ద్వారా ఇంగ్లిష్, తెలుగు గ్రామర్ స్మార్ట్ టీవీల ద్వారా నేర్చుకుంటున్నాం.

– కీర్తి శ్రీ, మోడల్ స్కూల్ విద్యార్థిని, ఆలూరు

రాసుకోవడం సులవుగా మారింది



మ్యాథ్స్‌కు సంబంధించిన ఫార్ములాలు, సైన్స్ సబ్జెక్టులోని డ్రాయింగ్‌లు, సోషల్‌లో మ్యాపులు వంటి నోట్స్ రాసుకోవడానికి సులువుగా మారింది. ఒక లెక్కను రెండు మూడుసార్లు ఉదాహరణ ద్వారా చేసి చూపిస్తున్నారు. సోషల్ మ్యాపింగ్‌లు, సైన్స్‌లోని డ్రాయింగ్‌లు సులువుగా అర్థం చేసుకుని రాసుకుంటున్నాం.

– మహమ్మద్ ఆజం, 8వ తరగతి విద్యార్థి, ఆలూరు,

అర్థవంతంగా బోధన



విద్యార్థులకు సులభతరంగా పాఠాలు అర్థమయ్యేందుకు డిజిటల్ బోధన ఎంతగానో ఉపయోగపడుతోంది. పాఠశాల్లో వీటి వినియోగం గొప్ప మార్పునకు సంకేతం. తొలి విడతలో మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలల్లో 110 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. అందుకు అవసరమైన ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో తెచ్చాం. ఇప్పటికే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వీటి ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

– కోమలా దేవి, ఎంఈఓ, ఆలూరు,

క్లుప్తంగా

వైభవంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం



అనంత పద్మనాభస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో వెలసిన అనంత పద్మనాభ స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి చతుర్దశి వ్రత మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త ఆవుల గోపాల్ ఆధ్వర్యంలో వేద పండితులు పవన్‌స్వామి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకంతో అనంత చతుర్దశి వ్రత మహోత్సవంతో పాటు సహస్ర నామార్చన అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కళాకారులు కూచిపూడి ప్రదర్శన నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

భగత్ సింగ్‌కు నివాళి



కైరుప్పలలో రక్తదానం చేస్తున్న యువకులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 116వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నాగేంద్రయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, నాయకులు రమేష్, లక్ష్మన్న, రంగప్ప, దస్తగిరి, చందు, ధను తదితరులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేసి కర్నూలు అక్షయ బ్లడ్ బ్యాంకుకు అందించారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో పొలం గట్టు విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ ఏర్పడగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కత్తి ఇమ్మానియేలు ఈ నెల 25న తన పొలం వద్ద గట్టు వేయిస్తుండగా పక్కనే పొలం కలిగిన కత్తి ప్రసాద్, సుజిత్‌కుమార్, ఇసాక్‌లు తమ పొలంలోకి నీరు వస్తాయని చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. దీంతో కత్తి ఇమ్మానియేలుపై ముగ్గురు దాడి చేసి గాయపరచగా బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగి తాత దర్గాల్లో, షిర్డి సాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాద, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

ఆక్రమణల తొలగింపు

పత్తికొండ రూరల్: పత్తికొండలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఊరువాకిలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు అక్రమ కట్టడాలను తొలగించి ఒకవైపు మురుగుకాలువ నిర్మాణం పూర్తి చేశారు. కాలువ నుంచి మూడు అడుగులు వెనక్కు నిర్మాణాలు తొలగించాలని గ్రామ పంచాయతీ అధికారులు వ్యాపారులకు సూచించారు. కాలువ నిర్మాణం పూర్తయిందే తరువాయి అక్రమార్కులు మళ్లీ మురుగు కాలువపైన నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు గురువారం వాటిని పరిశీలించి అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని సూచించారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో బుధవారం గుండెపోటుతో మృతి చెందిన ఉరుకుందప్ప (42) కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైనట్లు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ తెలిపారు. గురువారం మృతుడి భార్య (నామినీ) శేషమ్మకు తక్షణ సహాయం కింద రూ.10 వేలు నగదును సర్పంచ్ లింగమ్మ అందజేశారు. మిగతా సొమ్మును త్వరలోనే ఆమె బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వెల్లడించారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: ప్రభుత్వ భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని పీఆర్ ఏఈ జయన్న ఏజెన్సీ సభ్యులకు సూచించారు. గురువారం పూలచింత గ్రామంలో సచివాలయ భవన స్లాబ్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో అభివృద్ధి పనుల్లో భాగంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, పాల శీతలీకరణ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు ఐదో విడత వాహనమిత్ర

తుగ్గలి: రవాణా రంగంలో వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ఒక విప్లవంగా చెప్పుకోవచ్చు. ఉపాధి కోసం ఇతరులపై ఆధార పడకుండా ఆటో నడుపుకునే ఎంతో మందికి అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఈ పథకం ఎంతో మంది ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. ఆటో డ్రైవర్లకు ఆటోల నిర్వహణ, ఇతర ఖర్చుల వల్ల సరైన ఆదాయం లేకుండా పోయింది. దీంతో కొంత మంది నిద్రాహారాలు మానుకుని కుటుంబ పోషణ నిమిత్తం ఆటోలు తిప్పుకున్నా అంతంతమాత్రంగా ఆదాయం వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి చన్నీళ్లకు వేన్నీళ్లు తోడు అన్నచందంగా ట్యాక్సులు కట్టు కోవడానికి, బీమా చెల్లించుకోవడానికి, చిన్నచిన్న మరమ్మతులు చేయించు కోవడానికి ఉపయోగపడేలా సీఎం వైఎస్ జగన్ ఈ పథకాన్ని 2019లో ప్రారంభించారు. అప్పటినుంచి ఏటా ఆటో డ్రైవర్ల ఖాతాల్లో ఒకొక్కరికి రూ.10 వేలు జమ చేస్తున్నారు. శుక్రవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఈ నిధులు జమచేయనున్నారు. ఈ ఏడాది రేషన్ వాహన డ్రైవర్లకు ప్రభుత్వం ఈ పథకం వర్తింపజేస్తోంది. మండలవ్యాప్తంగా 347 మంది డ్రైవర్లు వాహన మిత్ర ద్వారా లబ్ధి పొందనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



రాయలసీమ రైతు మహాసభలో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అన్ని రంగాల్లో వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని కుర్ణికళ్యాణ మండపంలో రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రైతు సంఘం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని, వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తద్వారా ఈ ప్రాంతంలో వలసలు నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమశేఖర్ శర్మ, నాయకులు రవినారాయణరెడ్డి, శ్రీనివాసులు, అరుణ్, భాస్కర్‌రెడ్డి, బీసీ సంఘం జాతీయ నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ, డాక్టర్ గణేష్ ప్రసంగించారు. స్థానిక నాయకులు బజారప్ప, రాజు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న మల్లికార్జుననాయుడు

వెల్దుర్తి: స్థానిక వ్యాపారవేత్త మల్లికార్జున నాయుడు తన తల్లితండ్రులు నగరి పోలీస్ నాయుడు, లక్ష్మీనారాయణమ్మ జ్ఞాపకార్థం మండల పరిధిలోని బింగిదొడ్డి ప్రాథమిక పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలకు సెలవు అయినా దాత కోరిక మేరకు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులను పాఠశాల వద్దకు రప్పించి కార్యక్రమం నిర్వహింపజేశారు. అతిథులు ప్రముఖ పారిశ్రామిక వేత్త, గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ తిరివీధి సాయిప్రసాద్, గ్రామ పెద్దలు జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ బిస్వాస్ తదితరులు మాట్లాడుతూ.. దాత సేవలను కొనియాడారు. నాయకులు రాజేశ్వరరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, టీచర్ అల్లాబకష్, నాగమద్దయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విజేత నంద్యాల జిల్లా వృషభాలు




విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో శ్రీ మాతా మారెమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా, శిరివెళ్ల మండలం, గుంప్రమానుదిన్నె గ్రామానికి చెందిన కందూరి రాంభూపాల్‌రెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో రాతిదూలాన్ని 4,386 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం 13 జతల వృషభాలు పాల్గొనగా వైఎస్సార్ జిల్లా, వల్లూరు మండలం, సి.కొత్తపల్లె గ్రామానికి చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి వృషభాలు 4,343 అడుగులు, కర్నూలు జిల్లా, గోనెగండ్ల మండలం, చిన్ననేలటూరు గ్రామానికి చెందిన గాజుల కుమారస్వామి వృషభాలు 3,816 అడుగులు, వైఎస్సార్ జిల్లా, ఖాజీపేట మండలం, పుత్తూరు గ్రామానికి చెందిన కవ్వ బాలయ్య వృషభాలు 3,745 అడుగులు, అనంతపురం జిల్లా, గార్లదిన్నె మండలం, ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన నిమ్మకాయల భాస్కర్ వృషభాలు 3,600 అడుగుల దూరం లాగి తర్వాతి స్థానాల్లో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతలు దివంగత కుమ్మరి చిన్న మాదన్న, వన్నమ్మ దంపతుల కుమారులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలను అందజేశారు. శుక్రవారం సీనియర్ విభాగంలో అంతర్ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. వివరాలకు 75693 90793, 95738 88304 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ఎమ్మిగనూరులో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



హొళగుందలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా మిలాద్ ఉన్–నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని జామీయా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు మసీదు నుంచి పట్టణవీధుల గుండా 'నారే తక్బీర్ అల్లాహు అక్బర్ 'అంటూ నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదు సమీపంలో వేడుకలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముస్లింలు శాంతి, సహనంతో మెలగాలని మత పెద్దలు సూచించారు. జామియామసీదు కమిటీ అధ్యక్షులు ఖాశింబేగ్, సభ్యులు, మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: మండలంలో మిలాద్ ఉన్ నబి పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.మహమ్మద్ ప్రవక్త దివ్య సందేశాలను మతగురువులు వివరించారు. పట్టణంలోని ప్రధాన వీధిలో జెండాలతో భారీ ర్యాలీ చేశారు. చనిపోయిన పేద ముస్లింలకు ఉచిత దహన సంస్కారాలు నిర్వహించే యువకులను మహమ్మదీయ మసీదులో మతపెద్దలు శాలువాలతో సన్మానించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఆలూరు: మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని ఆలూరులోని కర్నూలు – బళ్లారి రోడ్డు సమీపంలోని ఈద్గా నుంచి జిమియా మసీదు వరకు ముస్లింలు ర్యాలీ చేపట్టారు. మత గురువు షెషిమాం ప్రవక్త బోధనలు వివరించారు. మంత్రి గుమ్మనూరు జయరాం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ

వెల్దుర్తి: ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త జన్మదినం, మిలాదున్ నబి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ కన్వీనర్ గట్టు ఆరిఫ్ ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలోని ఇన్, అవుట్ పేషెంట్లకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కన్వీనర్‌తోపాటు కరెస్పాండెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డి, వైద్యులు రంగస్వామి, ఈద్గా మసీదు పేష్‌మామ్ సయ్యద్ తాజుద్దీన్ ఖాద్రి చేతుల మీదుగా జరిగిన పంపిణీలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు చికెన్ మౌలాలి, ఇదుర్‌బాష, మహబూబ్ హుస్సేన్, అడ్వకేట్ షేక్షావలి, డాక్టర్ దస్తగిరి సాహెబ్, సుల్తాన్, మగ్బుల్, హసన్, హఫీజ్, హఖాని, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

30వ తేదీ వరకు క్రాప్ బుకింగ్

తుగ్గలి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగియనుందని ఏఓ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. రైతులు ఆయా గ్రామాల పరిధిలోని ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి ఈ నెల 30వ తేదీ సాయంత్రంలోపు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్, ఈ కేవైసీ పూర్తయితేనే పంటలకు ఉచిత బీమాతో పాటు ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందే అవకాశం ఉంటుందన్నారు.

రైతు బాంధవుడు డాక్టర్ స్వామినాథన్

దేవనకొండ: హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ మృతి బాధాకరమని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.జగదీష్, మండలాధ్యక్ష, కార్యదర్శులు ఇబ్రహీం, శివశంకర్, వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఎంఎస్ స్వామినాథన్ చేసిన కృషి చరిత్ర పుటలకెక్కిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు సగటు వ్యయం కంటే 50 శాతం ఎక్కువగా మద్దతు ధర నిర్ణయించాలని స్వామినాథన్ చేసిన సిఫార్సును కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, అదే ఆయనకు ఘనమైన నివాళి అని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



బోయ మాదన్న (ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు (సచివాలయ గృహసారథి) బోయ మాదన్న (48) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో ఒక్కసారిగా బీపీ, షుగర్ లెవల్స్ పడిపోవడంతోపాటు స్ట్రోక్ రావడంతో కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు వైద్యం కోసం తరలించేతోపే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, కంగాటి శివారెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వెల్దుర్తిలో సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: విత్తు నుంచి విక్రయం వరకు రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగనన్న వ్యవసాయానికి ప్రోత్సాహం, సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. జిల్లాలోనే ప్రథమంగా వెల్దుర్తి ఆర్బీకేలో గురువారం పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, ఏఓ అక్బర్‌బాషా సబ్సిడీ పప్పుశనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. పలు గ్రామాల రైతులకు సబ్సిడీ విత్తనాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పాలన సాగిస్తున్నాడన్నారు. సీజన్‌కు ముందే సబ్సిడీ విత్తనాలందించడం ఒక చరిత్ర అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎకరానికి 40 కేజీల విత్తనాలు అందిస్తుండడం గొప్ప విషయమన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. వెల్దుర్తి మండలానికి 1400 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరయ్యాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్బీకే సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వ తేదీ వెల్దుర్తి బాలుర హైస్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించనున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీదేవి సూచించారు. నిపుణులైన వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు ముత్యాల శైలజ, కోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, ఆరిఫ్, మాలిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా



పతకాలు పొందిన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీలు

ఎమ్మిగనూరుటౌన్: హర్యానాలోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ రోహతక్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి జరిగిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ సబ్ జూనియర్స్ ఛాంపియన్‌షిప్–2023లో ఎమ్మిగనూరు మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చాటి పతకాల పంట పండించారు. కుస్తీ పోటీలో వి.రూప బంగారు పతకం, కె.రమ్యశ్రీ, ఆర్.దీపిక, బి.చైత్ర, జె.హేమలత వివిధ విభాగాల్లో వెండి పతకాలు కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి గురువారం తెలిపారు. అలాగే డి.మౌనిక, దక్షిత, డి.అంజుమ్‌ఖుషి, హారిక, ఆర్.సీతాక్షి, కె.నిత్యసాయి, వై.భావన, బి.అస్రితలు వివిధ కేటగిరీల్లో కాంస్య పతకాలు పొందినట్లు చెప్పారు. వీరితో పాటు కెసి.సౌమ్య, రిజ్వాన, సుమిత్ర, వర్షిత, హరిక, దీపిక, వర్షిణి, అనుష, తబిత పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి సర్టిఫికెట్లు సాధించారని వారు తెలిపారు. సత్తా చాటిన క్రీడాకారిణులను అభినందించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంను చూపుతున్న సీఐ మోహన్‌రెడ్డి

నందవరం: మండలంలోని హాలహర్వి గ్రామ ఊరి బయట హెచ్.బాపురం గ్రామానికి వెళ్లే దారిలో భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. ఘటనపై గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మోహన్‌రెడ్డి వివరాలు వివరించారు. హాలహర్వి సమీపంలోని హెచ్.బాపురం వెళ్లే దారిలో బొలెరోలో కర్ణాటక మద్యం తరలిస్తునట్లు సమాచారం అందింది. వెంటనే ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి 28 బాక్సులు 2,688 (90 ఎంఎల్) ఒరిజినల్ ఛాయస్ డిలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసకుని వాహనాన్ని సీజ్ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడిన రాయచూర్ జిల్లా, లింగనకాన్ దొడ్డి గ్రామానికి చెందిన ఈడిగ మదన్, జగన్నాథ గౌడ, ఉసేనప్ప గౌడను అదుపులోకి తీసకుని కేసు నమోదు చేశారు. అలాగే ఎరిగేరి గ్రామానికి చెందిన కురవ మల్లేష్ కర్ణాటక మద్యం కొనుగోలు చేసి హెచ్.బాపురం గ్రామానికి చెందిన రాముడికి విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు తెలిసింది. వీరిద్దరిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా ఇంటింటి ఆరోగ్య సర్వే



బింగిదొడ్డి గ్రామంలో మహిళకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెల్దుర్తి: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. వెల్దుర్తి పీహెచ్‌సీ పరిధిలోని సూదేపల్లె, బింగిదొడ్డి, మదార్‌పురం, వెల్దుర్తి–3, శ్రీరంగాపురం, మల్లెపల్లె గ్రామాల్లో గురువారం జరుగుతున్న సర్వేను సూపర్‌వైజర్ నాగన్న తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ మనెమ్మ, ఏఎన్‌ఎంలు మహేశ్వరి, వీణ, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేస్తూ, బీపీ, షుగర్, హెచ్‌బీ, ఇతరత్రాలను పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. చికిత్స అవసరమైన వారికి టోకెన్లు అందించారు. బింగిదొడ్డి పరిధిలో ఈనెల 6న, సూదేపల్లె (మదార్‌పురం) పరిధిలో ఈనెల 9న వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని, టోకెన్లు అందుకున్న వారు శిబిరాలకు వచ్చి వైద్యసేవలు పొందాలని సూచించారు.

రేపు వెల్దుర్తిలో వైద్య శిబిరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి–1 హెల్త్ క్లినిక్ పరిధిలోని ప్రజల కొరకు ఈనెల 30న వైద్య శిబిరం స్థానిక బాలుర హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు రామళ్లకోట పీహెచ్‌సీ వైద్యాధికారి భువన తెలిపారు. ఈనెల 15 నుంచి వెల్దుర్తి–1 పరిధిలో 28 మంది వలంటీర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు వారి పరిధిలోని దాదాపు 95 శాతం గృహాలను సందర్శించి కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించినట్లు చెప్పారు. ఆయా కుటుంబాల్లో మెరుగైన వైద్య సేవలు అవసరమైన 485 మందిని గుర్తించి వైద్య శిబిరానికి హాజరు కావాల్సిందిగా టోకెన్లు అందించామన్నారు. టోకెన్లు అందుకున్న వారితో పాటు, అందుకోని వారు సైతం వైద్య సేవలు పొందవచ్చన్నారు.

కృష్ణగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నుంచి గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్, వైద్యాధికారి ప్రదీప్ గురువారం తెలిపారు. శనివారం అమకతాడు గ్రామంలో నలుగురు డాక్టర్లతో కూడిన బృందంతో క్యాంపు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.